# ఇది ఓ పరిష్కారమే!

-గర్భకుర్తి రాజేంద్ర

పట్టణమంతా అట్టడికి పోతోంది. సి.ఐ. మనోహర్ ఎమర్జెన్సీస్టాఫ్ మీటింగ్‌పెట్టి కొన్ని అత్యవసర ఆదేశాలు జారీచేశారు. ఇక అప్పటినుండి ప్రారంభమయింది అలజడి.

"బుయ్ బుయ్"మంటూ పోలీసు వ్యానులు ఆ పట్టణంలోని సందుసందుకూ తిరుగుతున్నాయి. ప్రతిషాపునూ గాలిస్తున్నాయి.

ఇంతాచేస్తే వాళ్ళు చేస్తోన్నదేమిటి? షాపువాళ్ళ నెవ్వరినీ ఏమీ అనడంలేదు.



ఇదీ ఆ పట్టణంలో ఒకటిరెండు రోజులుగా పోలీసువారు చేస్తోన్నపని. ఈ విషయం ఓ సంచలన వార్తయి ఆ పట్టణమంతా ప్రాకిపోయింది.

రోడ్లపైనా, సందుగొందుల్లో, పబ్లిక్‌ట్యాప్‌వద్ద, సినిమా హాళ్ళవద్ద ఒకచోటేమిటీ ఆ పట్టణంలో ఎక్కడా నలుగురు జనం చేరినా చర్చించు కుంటున్నారు.

సి.ఐ.మనోహర్ సహృదయుడు.

లంచాలూ, ముడుపులిమ్మని బాధపెట్టడం లేదు.

ఫుట్‌ఫాత్ మీద చిన్న చిన్న దుకాణాల వాళ్ళను ఖాళీచేయించి ఏడిపించడం లేదు.

వాళ్ళదృష్టంతా ఒకే వస్తువుపై కేంద్రీకరించబడింది. ఏ షాపులోనైనాసరే పిల్లలాడుకునే ఆటవస్తువుల్లో, తుపాకీలాంటి అయుధాలు కనిపిస్తే చాలు కోపంతో కన్నెర్ర చేస్తున్నారు.

అవి హానికరంకాని, ప్రమాదంలేని, ఆడుకోవడానికే తప్ప కాల్చడానికి పనికిరాని ప్లాస్టిక్‌తో చేసిన తుపాకులైనా సరే ఒక్కటీ వదిలిపెట్టకుండా బజార్లో పడేస్తున్నారు.

ఎక్కడివక్కడే దుకాణాలముందే ముక్కలు ముక్కలుగా కసితీరా విసిరేస్తున్నారు.

అలాగే పనిలోపనిగా హింస, సెక్సును రెచ్చగొట్టే సాహిత్యం ఏ దుకాణంలో దొరికినా వాటిని ఎక్కడికక్కడే బజార్లో కుప్పగా పెట్టి దహనం చేస్తున్నారు.

ఆ పట్టణప్రజలు అతణ్ణో దేవుడిలా కొలుస్తారు. మామూలుగా పోలీసులపై, ఆ డిపార్ట్‌మెంటుపై ఉన్న వ్యతిరేకభావం ఈయన విషయంలో మచ్చుకైనా కనిపించదు. పోలీసు డిపార్ట్ మెంటువారు అతని నిజాయితీకి నీరాజనం పడతారు. అతణ్ణి ఒకహీరోలా గౌరవిస్తారు.

అసలీ కాకీబట్టలు వేసుకొని, మొరటుగా బూతులు తిట్టే ఈ ఉద్యోగానికి అతడెంత మాత్రం సరిపోడని కొందరంటే, 'ఇంకానయం! అలాంటివారు కొందరైనా ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉండబట్టి ప్రజలు కనీసం ఈ మాత్రమైనా సుఖశాంతులతో ఉండగలుగుతున్నార'ని మరికొందరి వాదం.

ఏది ఏమైనా సినిమాహీరోలా, ఆబాలగోపాలం అందరూ మెచ్చిన కల్మషంలేని, కల్తీలేని దేశభక్తి, తన ప్రజలపై అచంచలప్రేమ, తనవృత్తిపై అమితగౌరవంకల స్వచ్ఛమైన, మచ్చలేని అరుదైన, అపురూపమైన పోలీసు ఆఫీసర్ మనోహరన్నది మాత్రం నిజం.

మీరే ఒక్క విషయంలోనూ ఏకాభిప్రాయానికి రాలేని వ్యక్తులైనా, అతని విషయంలో మాత్రం అందరికీ ఒకేమాట. అలాంటి విష్కళంక పోలీసు ఆఫీసరు, ఇలాంటి పని ఎందుకు చేస్తున్నట్లు? ఎవరికీ అంతుపట్టడం లేదు. ఎవరి ఊహకీ అందడంలేదు.

గత కొద్ది రోజులుగా అన్యమనస్కంగా ఉంటూ వచ్చిన సి.ఐ. మనోహర్ రెండురోజుల క్రితం అత్యవసరా దేశాలు జారీచేశారు. అప్పటి నుండి ఈ కార్యక్రమం జరుగుతూనేఉంది. ప్రజలు ఎవరికివారే చర్చించు కుంటున్నారు. వాళ్ళకుతోచిన కారణం చెప్పుకుంటు న్నారు. ఎవరూ సాహసించి సి.ఐ.గారిని ఈ విషయం అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంలేదు.

కారణం మరేంలేదు. అతడి ప్రతీచర్యా సహేతం, సమర్థనీయం అనే నమ్మకముండడమే.

అయితే ఈ చరకు కారణం తెలుసుకోవాలని ఆ పట్టణ ప్రజలందరికీ ఉబలాటంగానే ఉంది. ఆలస్యమైన కొద్దీ ఉత్సుకత పెరిగిపోతోంది. కాని తెలుసుకోవడం ఎలా?

తన దగ్గరకి వచ్చిన మహిళా ప్రతినిధులకు ఒక్క రోజులో సందేహనివృత్తి చేస్తానని హామీ ఇచ్చింది సి.ఐ. భార్య పద్మ. మరో ఇరువైనాలుగు గంటలు ఎప్పుడు గడుస్తాయా అని అందరూ ఎదురుతెన్నులు చూడసాగారు.

★ ★ ★

సి.ఐ. మనోహర్ భార్య రాత్రి అతడికి భోజనం వడ్డిస్తూ మెల్లగా కదిపింది.

"ఆ బొమ్మ సాహిత్యం ఏరేసి మరీ కాల్చేస్తున్నారు. బాగుంది. కాని ఈ ప్లాస్టిక్ బొమ్మలు ప్రమాదకరమైనవేం కావుగా. తుపాకీ ఆకారం కలిగున్నంతమాత్రాన ఎందుకండీ వాటిపై మీకంత కోపం?" అని.

అప్పుడు, ఆ క్షణాన మెల్లగా పెదవివిప్పి అతడి హృదయం ఆమె ముందు పరిచాడు సి.ఐ. మనోహర్.

"ప్రపంచదేశాలకే శాంతిసందేశం నందించిన ఈ దేశం ఈ రోజు ఎలా హింసవైపు, మారణహోం వైపు, రక్తపాతం వైపు పయనిస్తోందో. ఎప్పుడైనా ఆలోచించావా?

హత్యలూ, కాల్పులూ, మానభంగాలూ, మార ణాయుధాలూ, బాంబులతో యుద్ధాలూ... ఈ దేశంలో శాంతికరువైంది. అశాంతి ప్రబలింది. నేనుచేస్తోన్న ఈ పోలీసు ఆఫీసర్ ఉద్యోగంకూడా కత్తిమీది సాములా లేదూ?

దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఏ ఘాతుకం జరుగుతుందో ఏదుర్వార్త వినవలసివస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రాణాలరచేత పెట్టుకొని బ్రతకడం లేదూ?

ఈ అశాంతికి కారణం ఏమిటి? దీనికి పరిష్కార మేమిటి?..."

అతని వాగ్ధాటికి వడ్డించడం మరిచిపోయి, బొమ్మలా ఉండిపోయింది తదేకంగా వింటూ పద్మ.

మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు మనోహర్.

"మొన్న బుధవారం అనుకుంటాను. టీ.వీ.లో ఒక చక్కని డాక్యుమెంటరీ ప్రసారమయింది. "అందులో చెప్పారు, నిర్మల్ బొమ్మల ప్రత్యేకత గురించి. అవి మన ప్రాచీన సాంప్రదాయాలకు అద్దం పడతాయనీ చిన్నపిల్లల్లో దేశభక్తిని పెంపొందిస్తాయనీ అలాగే వాళ్ళల్లో సృజనాత్మ కతను కలిగిస్తాయనీ.

అందుకనే నిర్మల్ బొమ్మల్లో ఆధునిక స్టెన్‌గన్‌లు, మరతుపాకుల్లాంటి మారణాయుధాలను పోలిన బొమ్మలు ఉండవనీ, అలాంటి బొమ్మలు చిన్నపిల్లలపై దుష్ప్రభావం కలిగిస్తాయనీ, వాళ్ళ లేతహృదయాల్లో క్రౌర్యాన్నీ, దుర్మార్గాన్నీ ప్రేరేపిస్తాయనీ, తామందుకే అలాంటి ఆటబొమ్మలు తయారుచేయమనీ చెప్పలేదూ? నువ్వూ విన్నావుగా!" గుర్తుచేశాడు మనోహర్.

"వినకేం విన్నాను! కాని ఇలా మీలా సున్నితంగా ఆలోచించలేకపోయాను" చెప్పింది పద్మ తన అసమర్థతను ఒప్పుకుంటూ.

"నిజం పద్మా! ఇవాళ ఎక్కడ చూసినా వాతావరణ మంతా కలుషితమై ఉంది. సినిమాలూ, పుస్తకాలూ, టీ.వీ.లూ అన్నింటిలోనూ హింసను ప్రేరేపించడం, సెక్స్‌ను అతిగా చూపించడం మామూలైపోయింది.

నానాటికీ దిగజారుతున్న పరిస్థితులకు ఇవన్నీ కారణాలు కావూ? పెద్దల సంగతి వదిలేద్దాం. మన పిల్లలనయినా చక్కటి వాతావరణంలో పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా లేదూ?

పిల్లలకు సరదా పుట్టించేవీ. ఉత్సాహం కలిగించేవీ, కుతూహలం పెంచేవీ. వాళ్ళ ఆలోచనా శక్తికి పదునుపెట్టేవీ. ఆటవస్తువుల్ని అందించాలి.

అలాకాక ఆటలనాటినుండే వాళ్ళచేతులకు మర తుపాకులందిస్తే, బాంబులతో ఆటలు నేర్పిస్తే వాళ్ళు హింసవైపు తప్ప శాంతి వైపు ఎలా పయనిస్తారు? ఉత్తమ జాతిపౌరులుగా ఎలా తయారవుతారు?

నేనెప్పటినుండో ఆలోచిస్తున్నాను. ఈ సమస్య లన్నిటికి పరిష్కారమేదని?

నిర్మల్‌బొమ్మల డాక్యుమెంటరీ చూసినతరువాత ఒక పరిష్కారం లభించినట్లు అనిపించింది.

అయితే అన్ని సమస్యలకూ ఇదొకటే సరిష్కార మననుగానీ రాబోయే తరాన్ని శాంతిమార్గంవైపు నడిపించడానికీ, నేటి పిల్లలను రేపటి చక్కటి పౌరులుగా తీర్చిదిద్దడానికీ, పిల్లలాడుకునే ఆటవస్తువుల్లో మార ణాయుధాలు పోలిన ఆటబొమ్మలు ఉండకూడదని నా ఆలోచన.

అందుకే వాటిని ఆటబొమ్మల్లోంచి తొలగించడమే నేను చేస్తోన్న పని. మరి నువ్వేంటావు?" అంటూ సాలోచనగా భార్యవైపు చూశాడు మనోహర్.

"నిజంగా మీది చాలా మంచి ఆలోచన. కాని మీ ఒక్కరితోనే ఇది సాధ్యమవుతుందా?" సందేహంగా ఎదురుప్రశ్నవేసింది పద్మ.

"నిజమే పద్మా! ఇలాంటి మంచి ఆలోచన ప్రభుత్వానికికూడా రాకపోవడం చిత్రంకదూ! ఈ చర్య తీసుకునే ముందు పై అధికారుల అనుమతి తీసుకున్నాను. సమగ్రనివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపించాను. ఈచర్యతో, వచ్చేతరమైనా ఏమాత్రం బాగుపడినా నాకంతేచాలు. శాంతికి మార్గం చూపిస్తే చాలు" తృప్తిగా అన్నాడు సి.ఐ. మనోహర్.

"అసలు విషయం ఇదన్నమాట. నస్పెన్సుతో చంపేశారు కదండీ" అంది సంతోషంగా పద్మ, ఆ రహస్యం ముందుగా తనకే తెలిసినందుకు సంబరపడిపోతూ.

రేడియోతో, టీ.వీ.తో, వార్తాపత్రికలతో పనిలేకుండానే ఆ వార్త అరగంటలో పట్టణమంతా ప్రాకిపోయింది.

ఆ పట్టణప్రజలంతా సి.ఐ. మనోహర్ విజ్ఞతకు ఎంతో మెచ్చుకున్నారు. తమపిల్లలు ఆడుకునే ఆట వస్తువుల్లో తుపాకుల్లాంటివి ఉంటే తీసిదూరంగా విసి రేశారు.

గర్శకుర్తి రాజేంద్ర
పోస్టల్ అసిస్టెంట్
ప్రధాన తపాల కార్యాలయము,
కామారెడ్డి - 503 11.